ప్రమాదకరంగా కేబుల్ తీగలు!

ఇబ్బందులు పడుతున్న స్థానికులు



విద్యుత్ స్తంభానికి పిచ్చుక గూళ్లుగా ఉన్న కేబుల్ వైర్ల కట్టలు



శాంతినగర్‌లో విద్యుత్ స్తంభం చుట్టూ పడి ఉన్న కేబుల్ తీగలు



ప్రమాదకరంగా వేలాడుతున్న కేబుల్ తీగలు

గోపాలపట్నం: కేబుల్ సంస్థల నిర్లక్ష్యం వల్ల ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. ప్రమాదాలకు దారులు తెరుస్తున్నట్లుగా ఉన్నాయని స్థానికులు వాపోతున్నారు. పలు ఇంటర్నెట్ సర్వీసెస్ నిర్వాహకులు, కేబుల్ టీవీ నిర్వాహకుల వ్యవహారం ఇబ్బందికరంగా పరిణమిస్తోంది. విద్యుత్ స్తంభాలకు కేబుల్ వైర్లు కట్టకూడదన్న నిభంధలను పెడచెవిన పెడుతున్నారు. పలువురు విద్యుత్ సిబ్బంది ఈ కేబుల్ తీగల వద్ద ప్రమాదబారిన పడి మృత్యువాత పడిన ఘటనలు జరిగినా అధికారులు వీటిపై చర్యలు తీసుకోవడం లేదని విమర్శిస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారులకు విద్యుత్ స్తంభాలను వినియోగించుకున్నందుకు ప్రతిఫలంగా నిర్వాహకులు విద్యుత్ సిబ్బందికి కొంత చెల్లించడం వల్లే పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. జీవీఎం 52వ వార్డు శాంతినగర్‌లో కేబుల్ తీగలు పిచ్చుక గూళ్ల మాదిరిగా విద్యుత్తు స్తంభాలకు ఉన్నాయి. శాంతినగర్ పార్క్ వద్ద రోడ్లపై విచ్చల విడిగా కేబుల్ తీగలు పడేశారు. కొన్ని చోట్ల ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. కొన్ని రోజులుగా ఇలాగే పడి ఉన్నాయని ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ప్రమాదకరంగా కేబుల్ తీగల్ని తొలగించి.. నిర్వాహకులపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సందడిగా మహిళా దినోత్సవం



నృత్యప్రదర్శనతో అలరిస్తున్న చిన్నారులు



జియ్యాని శ్రీధర్ దంపతులను సత్కరిస్తున్న దిశ ఫౌండేషన్ సభ్యులు

గోపాలపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మహిళలకు పెద్ద పీట వేశారని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అన్నారు. జీవీఎంసీ 52వ వార్డు మర్రిపాలెం వుడాలేఅవుట్ లోని ఓ ఫంక్షన్ హాలులో సోమవారం మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, కనకదుర్గ దంపతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు రాజకీయ పదవుల్లో 50 శాతం ఇచ్చారని గుర్తు చేశారు. స్థానిక సంస్థలతో పాటు ప్రభుత్వ పథకాల్లో కూడా మహిళలకే తొలి ప్రాధాన్యత కల్పించారని పేర్కొన్నారు. దిశ ఫౌండేషన్ సంస్థ చైర్‌పర్సన్ నిడిగుంట అరుణ మాట్లాడుతూ మహిళల సాధికారతే లక్ష్యంగా దిశ ఫౌండేషన్ ఏర్పడిందని అన్నారు. జియ్యాని శ్రీధర్ దంపతులతో పాటు పలువురి మహిళలను సత్కరించారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షురాలు స్వాతి వర్మ, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బుద్ధా శివాజీకి మళ్ల పరామర్శ



బుద్ధా శివాజీ యోగక్షేమాలు తెలుసుకుంటున్న మళ్ల విజయప్రసాద్ దంపతులు

గోపాలపట్నం: కేంద్ర గౌరీ సేవా సంఘం అధ్యక్షుడు బుద్ధా శివాజీని సోమవారం రాష్ట్ర విద్యా సంక్షేమ, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ చైర్మన్ మళ్ల విజయప్రసాద్ దంపతులు పరామర్శించారు. ఇటీవల ఆయన భార్య బుద్ధా తులసమ్మ మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ మేరకు గోపాలపట్నంలోని శివాజీకి ఇంటికి మళ్ల దంపతులు వెళ్లి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు అప్పలస్వామి, యల్లపు వెంకటేశ్వరరావు, దొడ్డి సతీష్ తదితరులు ఉన్నారు.

'స్పందన'కు 12 అర్జీలు

సీతమ్మధార: సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 12 అర్జీలు అందాయి. ప్రజల నుంచి వాటిని తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ పేర్ల శ్యామ్‌ప్రసాద్ స్వీకరించి పరిశీలించారు. వినతుల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాల కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చేతన్, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

విస్తృతంగా వాకర్స్ క్లబ్ కార్యక్రమాలు



మాట్లాడుతున్న డాక్టర్ రవీంద్ర

తాటిచెట్లపాలెం: మురళీనగర్ వాకర్స్ క్లబ్‌లో వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళీ ఆధ్వర్యంలో సోమవారం నెల వారీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథి ఇంటర్నేషనల్ వాకర్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎస్.పి.రవీంద్ర, ఇంటర్నేషనల్ సెక్రటరీ వాకర్ కె.ద్వారకానాథ్ మాట్లాడుతూ పలు సూచనలిచ్చారు. వాకర్స్ క్లబ్ కార్యక్రమాలను విస్తృతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో భాగంగా ప్రపంచ శాంతి కోసం మౌనం పాటించారు. రామానుజ సుధీర్ భూరి విరాళంతో వాకర్స్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన నిఘా నేత్రాలను అతిథుల చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ వైస్ ప్రెసిడెంట్లు ఆదిభట్ల రామకృష్ణ, మల్లా రామకృష్ణ, సెక్రటరీ లంకా వెంకట సుధాకర్, కోశాధికారి జనపరెడ్డి కూర్మారావు, జాలీ వాకర్ నానుపాత్రుని ప్రకాష్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో స్నేహభావం ముఖ్యం



మాట్లాడుతున్న ఆచార్య యోహాన్‌బాబు

ఏయూ క్యాంపస్: విద్యార్థులు స్నేహభావంతో కలసి కట్టుగా పనిచేస్తే మెరుగైన ఫలితాలు సాధించగలరని ఏయూ తెలుగు విభాగం విశ్రాంత ఆచార్యుడు జి.యోహాన్‌బాబు అన్నారు. సోమవారం ఉదయం ఏయూ తెలుగు విభాగంలో నిర్వహించిన విద్యార్థుల స్వాగత వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించే కార్యక్రమాలు భవిష్యత్తుకు బాటలు వేస్తాయన్నారు. తెలుగు సాహిత్యాన్ని అధ్యయనం చేస్తే ఎన్నో ఉపాధి అవకాశాలు ఉన్నాయని, సినిమా, పత్రికలు, పర్యాటక రంగాలలో అవకాశాలు ఎదురుచూస్తున్నాయని చెప్పారు. విద్యార్థులు మార్కుల కోసం కాకుండా మనస్సు పెట్టి అవగాహనతో చదువుకుంటే ఉన్నత శిఖరాలు అధిరోహించగలరన్నారు. తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్ర అప్పారావు మాట్లాడుతూ తెలుగు సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా విభాగాన్ని తీర్చిదిద్దడం ఆనందంగా ఉందన్నారు.

సీతంరాజు సుధాకర్‌ను గెలిపించుకుందాం



59వ వార్డులో పట్టభద్రులకు కరపత్రాలు అందిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

మల్కాపురం: ఈ నెల 13న జరిగే ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అన్ని అర్హతలున్న వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని పార్టీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త, విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ పిలుపునిచ్చారు. 59వ వార్డులో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులను కలిసి కరపత్రాలు అందజేసి మాట్లాడారు. ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తూ ప్రజలందరికీ సుపరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బలపరిచిన సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపిస్తే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రేవళ్ల సత్యనారాయణ, గాలి సన్యాసిరావు, అమరావతి, ఖాన్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

➡ 61వ వార్డులోని పలు ప్రాంతాల్లో కార్పొరేటర్ కొణతాల సుధ గ్రాడ్యుయేట్లను కలిసి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని కోరారు. కొల్లి నూకరెడ్డి, బాలు, లలిత, స్వప్న, బూస అప్పలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

11న వెంకన్న తీర్థం



పందిరి రాట వేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు

కంచరపాలెం: స్థానిక తిక్కవానిపాలెం కలియుగ వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద ఈ నెల 11న జరగనున్న వేంకటేశ్వర తీర్థ మహోత్సవానికి సోమవారం పందిరి రాట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు చామర్తి జగనాథ శర్మ, శంకరశర్మ నేతృత్వంలో ఆలయ చైర్మన్ గంటా కామరాజు, గ్రామాధ్యక్షుడు ఉమ్మిడి వాసుదేవరావు, యశోద దంపతులు పందిరి రాటకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవ పోస్టర్‌ను వాసుదేవరావు, కామరాజు, పట్టిమి రాజు ఆవిష్కరించారు. ఈ మేరకు ఆలయాన్ని విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరిస్తున్నారు. ఈ నెల 18న ఆలయం వద్ద అన్నదానం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

ప్రజా వినతుల పరిష్కారానికి ప్రాధాన్యం



అర్జీలను పరిశీలిస్తున్న జెడ్సీ కృష్ణ

కంచరపాలెం: ప్రజా వినతుల పరిష్కారానికి అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు జీవీఎంసీ జోన్–5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ తెలిపారు. జ్ఞానాపురంలోని జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 05 వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని జెడ్సీ స్వీకరించి పరిశీలించారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి 02, పబ్లిక్ హెల్త్‌కు 01, రెవెన్యూ విభాగానికి 02 చొప్పున అందినట్లు ఆయన చెప్పారు. సత్వరమే వాటిని పరిష్కరించాలని జోనల్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్–1, 2 టి.ఎస్.ఎస్.రాజు, ఆర్.వి.రాజు, రెవెన్యూ ఆర్వో బాబురావు, ఇంజినీరింగ్ ఈఈ టి.ప్రసన్నరెడ్డి, వాటర్ డీఈ భరణికుమార్, ఏఎంహెచ్‌వో డాక్టర్ రాజేష్, సూపర్‌వైజర్ జనార్దన్, ఏపీడీ పద్మావతి, అపరంజిత, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

రైల్వే పారిశుధ్య కార్మికులకు వితరణ



కార్మికురాలికి శానిటరీ నాప్‌కిన్లు అందిస్తున్న ఈకార్వో ప్రెసిడెంట్ పారిజాత సత్పతి

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే వుమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్(ఈకార్వో) వాల్తేర్ డివిజన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సోమవారం ఈకార్వో ప్రెసిడెంట్ పారిజాత సత్పతి విశాఖ రైల్వే స్టేషన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులకు శానిటరీ నాప్‌కిన్లు అందజేశారు. వారోత్సవాల్లో భాగంగా ఈకార్వో ఆధ్వర్యంలో మహిళల హక్కులు, లింగసమానత్వం, పునరుత్పాదక హక్కులు, మహిళలపై జరుగుతున్న హింస వంటి అంశాలపై దృష్టి సారిస్తున్నట్లు పారిజాత సత్పతి తెలిపారు. వీటితోపాటు ఉత్తమ మహిళా ఉద్యోగి, ఉత్తమ విద్యార్థుల(రైల్వే ఉద్యోగుల్లో)ను గుర్తించి వారికి ప్రశంసాపత్రాలు, స్కాలర్‌షిప్స్ వంటివి అందజేయడం, టాలెంట్ హంట్, పేదలకు సహాయం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆమె చెప్పారు. కార్యక్రమంలో ఈకార్వో సెక్రటరీ ప్రియాంక శ్రీదేవి, ఇతర ఎగ్జిక్యూటివ్ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తల్లి, కుమారుడికి గాయాలు

మర్రిపాలెం: ఆటో ఢీకొని తల్లి, కుమారుడికి గాయాలైన ఘటన సోమవారం కంచరపాలెం పరిధిలో జరిగింది. ఐదో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా.. కాన్వెంట్ జంక్షన్ నుంచి కంచరపాలెం మీదుగా ద్విచక్ర వాహనంపై జ్యోతీనగర్‌కు వస్తున్న భర్త, భార్య, కుమారుడి ని ముత్యాలమ్మ గుడి దగ్గర న్యూకాలనీ నుంచి కంచరపాలెం వైపు వెళ్తున్న ఏస్ ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో యాండ్ర మాధురి, ఆమె కుమారుడు ఐదేళ్ల నవ్‌నీత్‌సాయికి గాయాలయ్యాయి. బాబుకు ముక్కు, చెవి వెంబడి రక్తం కారడంతో అపస్మారక స్థితిలో ఉన్నాడు. ప్రస్తుతం చికిత్స అందిస్తున్నారు. మాధురి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పేద కుటుంబానికి నాయీ బ్రాహ్మణుల సాయం



వృద్ధురాలు దమయంతికి నిత్యావసర సరకులు అందిస్తున్న సంఘ ప్రతినిధులు

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు ఎదురవానిపాలెంలో నివసిస్తున్న పేద వృద్ధురాలు పి.దమయంతి అనారోగ్యానికి గురై ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. విషయం తెలుసుకున్న నాయీ బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు కోట్కొండ రామకృష్ణ, ఉప్పలవలపు లోవరాజు తదితరులు సోమవారం ఆమె ఇంటికి వెళ్లి నిత్యావసర సరకులు, కొంత నగదు అందించారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా దమయంతి కుటుంబానికి సాయం చేసినట్లు తెలిపారు. ఇటువంటి సేవా కార్యక్రమాలతో తమ సంఘం మరింత ముందుకు వెళ్తుందన్నారు. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణుల సంఘం ప్రతినిధులు వంత్రాపు సింహాచలం, ఎ.నాగేశ్వరావు, రేజేటి సింహాచలం, పి.నాగేశ్వరరావు, కె.శివ, నూకరాజు, కరుణాకర్, అధికార ప్రతినిధి ఎల్.ఎ.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మేధోశక్తిని మెరుగుపరచుకోవడం తప్పనిసరి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు

ఏయూ క్యాంపస్: విద్యార్థులు తమ మేధోశక్తిని నిరంతరం మెరుగుపరుచుకోవడం తప్పనిసరని ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ఉదయం ఏయూ టీఎల్ఎన్ సభా మందిరంలో ఉన్నత విద్యా మండలి నిర్వహించిన జోనల్ స్థాయి క్విజ్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్ఞాపకశక్తికి పరీక్షగా క్విజ్ పోటీలు నిలుస్తాయన్నారు. విశ్లేషణాత్మక ఆలోచనలకు ఈ పోటీలు దోహదపడతాయని చెప్పారు. విద్యార్థులు తమ జ్ఞానాన్ని పెంచుకుంటూ, కాలాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తూ పోటీ పడాలన్నారు. కార్యక్రమ అధ్యక్షుడు ఆచార్య ఎ.నాగహనుమాన్ మాట్లాడుతూ 40 గ్రూపులుగా 80 మంది విద్యార్థులు పోటీలలో పాల్గొంటున్నారన్నారు. విద్యార్థులకు వర్సిటీ ప్రాంగణంలో వసతి, భోజన సదుపాయాలు కల్పించామన్నారు. ఉన్నత విద్యా మండలి అధికారి ఎ.ఆర్.నగేష్ మాట్లాడుతూ మూడు రీజియన్‌లుగా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. వీటిలో విజేతలకు రాష్ట్రస్థాయి పోటీలకు అవకాశం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ శ్రీధర్, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్, తదితరులు పాల్గొన్నారు.

ద్వారకా పోలీసుల ఔదార్యం



వృద్ధుడు జగన్నాథంను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న కానిస్టేబుల్ వెంకటేష్

సీతమ్మధార: మతిస్థిమితం లేని ఓ వృద్ధుడిని ద్వారకా జోన్ పోలీసులు గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించి తమ ఔదార్యం చూపారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం సాయంత్రం సీఐ సింహాద్రినాయుడు నేతృత్వంలో పెట్రోలింగ్ చేస్తుండగా.. నిస్సహాయ స్థితిలో ఉన్న ఒక వృద్ధుడిని గుర్తించారు. అతడిని ప్రశ్నించగా మతిస్థిమితం సరిగ్గా లేదని తెలుసుకున్న కానిస్టేబుల్ వెంకటేష్ కొన్ని ఆనవాళ్ల గుర్తించి సూర్యాబాగ్‌లో ఉండే కుటుంబ సభ్యులకు అప్పగించి వివరాలు అడిగి తెలుసుకున్నాడు. సోమవారం ఉదయం 5.30 గంటల సమయంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో బయటకు వెళ్లిన వృద్ధుడు ఎడ్ల జగన్నాథం కనిపించకపోవడంతో రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో అతడి మనవరాలు కె.ఎస్.ప్రత్యూష ఫిర్యాదు చేశారు. నగర పోలీస్ కమిషనర్ వాట్సాప్ నంబర్‌కు ఒక సందేశం ఇవ్వడంతో పోలీసులు అప్రమత్తమై వృద్ధుడిని అతడి కొడుకు ఎడ్ల రవి, కుటుంబ సభ్యులకు అప్పగించారు. సీఐ, సిబ్బందికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



బాలికల గృహంలో మాట్లాడుతున్న రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ అప్పారావు

ఆరిలోవ: మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు కోరారు. రూరల్ తహసీల్దారు కార్యాలయం సమీప ప్రభుత్వ బాలికల గృహాన్ని సోమవారం కమిషన్ సభ్యుడు గొండు సీతారాం, జిల్లా బాలల సంక్షేమ సమితి సభ్యులతో కలసి ఆయన సందర్శించారు. గృహంలో బాలికలకు కల్పిస్తున్న సౌకర్యాలతో పరిసరాలను పరిశీలించారు. అనంతరం అక్కడ బాలికలతో అప్పారావు మాట్లాడారు. పదో తరగతి చదువుతున్న బాలికల పట్ల సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపాలని గృహం సూపరింటెండెంట్ సునీతకు సూచించారు. వారికి క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందించాలన్నారు. విద్యార్థులు చెడు స్నేహాలు చేయకూడదన్నారు. క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి చేరాలన్నారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంక్షేమ సమితి చైర్మన్ ఎం.ఆర్.ఎల్.రాధ, సభ్యుడు సూర్యనారాయణ, గృహం సిబ్బంది పాల్గొన్నారు.

లయోలా ఆశ్రమంలో వృద్ధులకు ఆశ్రయం



వృద్ధురాలిని లయోలా వృద్ధాశ్రమంలో చేర్పిస్తున్న ట్రస్ట్ సభ్యురాలు మమత



వృద్ధుడిని లయోలా వృద్ధాశ్రమంలో చేర్పించిన వాసు

అల్లిపురం: ఆదరణకు నోచుకోని, అనారోగ్యంతో ఉన్న ఇద్దరు వృద్ధులను స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పెందుర్తిలోని లయోలా ఆశ్రమంలో చేర్పించారు. వివరాలివి.. కంచరపాలెం బస్టాపులో 80 ఏళ్ల ఓ వృద్ధురాలు నాలుగు రోజులుగా తిండి కూడా తినకుండా పడుకుని ఉన్నారు. తన పేరు, వివరాలు ఏమీ చెప్పడం లేదు. దీంతో స్థానికులు మమత చారిటబుల్ ట్రస్ట్ సభ్యురాలు ఎల్లేటి మమతకు సమాచారం అందించారు. ఆమె అక్కడికి చేరుకుని వృద్ధురాలికి సపర్యలు చేశారు. అనంతరం కంచరపాలెం ఏఎస్ఐ ఆదిరాజు సహకారంతో పెందుర్తి లయోలా వృద్ధాశ్రమంలో చేర్పించారు.

➡ భీమ్‌నగర్, జీవీఎంసీ ఏయుటీడీ నైట్ షెల్టర్‌లో 2018 నుంచి ఆశ్రయం పొందుతున్న విజయకుమార్ (84) పక్షవాతంతో మంచం పట్టారు. ఈయనకు భార్య ఉంది. కుమారుడు, కుమార్తె ఇద్దరూ మరణించారు. పక్షవాతం కారణంగా కదలని పరిస్థితిలో ఉన్న ఆయన్ను సంస్థ ప్రతినిధి పి.వాసు పెందుర్తి లయోలా వృద్ధాశ్రమంలో సోమవారం చేర్పించారు.


సమన్వయంతో పథకాల అమలు



శిక్షణకు హాజరైన అధికారులతో ఐఐఎం సంచాలకుడు ఆచార్య చంద్రశేఖర్

ఏయూ క్యాంపస్: ప్రభుత్వ పథకాల అమలులో సమన్వయం ఎంతో అవసరమని కేంద్ర ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ పూర్వ కార్యదర్శి అజయ్ ప్రకాష్ షానోయ్ అన్నారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విశాఖపట్నంలో డిజిటల్ గవర్నెన్స్–మేనేజ్‌మెంట్ అంశంపై ఆల్ ఇండియా సర్వీసెస్ అధికారులకు ఐదు రోజుల స్వల్పకాలిక శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ శిక్షణను కేంద్ర ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ పూర్వ కార్యదర్శి అజయ్ ప్రకాష్ షానోయ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సాధారణ పౌరుడికి విభిన్న సేవలను సాంకేతిక విధానాలు ఏ విధంగా చేరువ చేస్తున్నాయో వివరించారు. ప్రపంచానికి అవసరమైన ఆర్థిక వ్యవస్థను నిర్మించే సామర్థ్యం భారత్‌కు ఉందని స్పష్టమైందన్నారు. పారదర్శకతను పెంపొందించడానికి డిజిటల్ మౌలిక వసతులు ఉపయుక్తంగా నిలుస్తున్న విధానాన్ని తెలియజేశారు. ఐఐఎం విశాఖపట్నం సంచాలకుడు ఆచార్య ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ కొన్నేళ్లుగా ప్రభుత్వ, ప్రైవేటు రంగాల నిపుణులు ఐఐఎంవీ అందిస్తున్న శిక్షణ కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో ఆచార్య నీన పాండే, ఆచార్య శ్రీనివాస్ జోస్యుల తదితరులు పాల్గొన్నారు.

నేడు పౌర్ణమి పూజలు



అలంకరణలో శివలింగం

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెం ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం ఫాల్గుణ మాస పౌర్ణమి పూజలు నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు. ఉదయం ఆరు గంటల నుంచి స్వామికి పంచామృతాభిషేకాలు, మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నసమారాధన కార్యక్రమం జరుగుతాయన్నారు. షిర్డీసాయి భక్తురాలు లక్ష్మి నేతృత్వంలో స్వయంగా అన్నదానం చేస్తున్నట్లు చెప్పారు.

మూల్యాంకన కేంద్రం పరిశీలన



పరిశీలిస్తున్న రెక్టార్ సమత

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రశ్నాపత్రాల మూల్యాంకన కేంద్రాన్ని ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత సోమవారం ఉదయం సందర్శించారు. బీఈడీ మూడో సెమిస్టర్ ప్రశ్నపత్రాల మూల్యాంకనం జరుగుతున్న విధానాన్ని ఆమె ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు, అధికారులు పాల్గొన్నారు.

లీగల్ కౌన్సిల్ సేవలు వినియోగించుకోండి



జైల్‌లో ఖైదీలకు అవగాహన కల్పిస్తున్న న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి బులికృష్ణ

ఆరిలోవ: జైల్‌లో జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఏర్పాటు చేసిన లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సేవలను ఖైదీలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి కె.కె.వి.బులికృష్ణ సూచించారు. విశాఖ కేంద్ర కారాగారాన్ని ఆయన సోమవారం సందర్శించారు. ఇక్కడ మహిళా ఖైదీలు ఉండే బేరక్‌లను పరిశీలించారు. వారికి అందుతున్న ఆహారం, వసతి, తాగునీరు, వైద్యం తదితర మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. అనంతరం మహిళా ఖైదీలకు న్యాయపరమైన విషయాలపై అవగాహన కల్పించారు. వారికి ఉన్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. న్యాయ సంబంధమైన సమస్యలను సంస్థ ద్వారా పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. మహిళా లీగల్ వలంటీర్లు రాశి, దివ్య, సుజాత, జైల్ అధికారులు పాల్గొన్నారు.